

బాస్ బ్లాగ్

# ఆటల 'అశోకుడు'...



**ప్రజాసేవతో కూడిన** వృత్తిలో పరిమళిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంటారు కొందరు అధికారులు. అలాగే ప్రవృత్తిలోనూ ప్రతిభాపాటవాలు చాటుతూ పదిమందికి ప్రేరణనిస్తుంటారు మరికొందరు. ఆ రెండు లక్షణాలూ కలగలిసి యువతకు స్ఫూర్తినిస్తున్నారు జలమండలి ఎండీ అశోక్ కుమార్. స్వతహాగా క్రీడాకారుడైన ఆయన ఐఏఎస్ అధికారిగా ఎన్నెన్నో పదవులు చేపట్టినా.... ఇప్పటికీ క్రీడల పట్ల తన ఆసక్తిని ప్రదర్శిస్తూనే ఉంటారు. ఒక క్రీడాకారునిగా అశోక్‌కుమార్ అంతరంగం నేటి 'బాస్ బ్లాగ్'లో మీకోసం...ఆయన మాటల్లోనే...

సిటీబ్యూరో, న్యూస్‌లైన్:

ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే నాకు క్రీడలంటే ఆసక్తి ఏర్పడింది. జాగింగ్ నిత్యకృత్యం. ఆ తరువాత ఆరోతరగతి నుంచి టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్ ఇష్టమైన ఆటలుగా మారాయి. టేబుల్ టెన్నిస్‌లో పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. జాతీయస్థాయి ఛాంపియన్లయిన చంద్రశేఖర్, శ్రీరాం, బోన థామస్‌లతో కలిసి ఆడే గొప్ప అవకాశం దక్కింది. అప్పట్లో ఇది నాకు ఎంతో గర్వంగా అన్పించేది. అప్పటికున్న పరిస్థితుల్లో విద్యకే ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చింది. పదోతరగతిలో కేరళలో నాకు స్టేట్ ర్యాంకు రావడంతో చదువు పైనే దృష్టి నిలిపా. క్రీడలను అప్పటికి పూర్తిస్థాయిలో వృత్తిగా స్వీకరించే అవగాహన లేదు. అయితే పూర్తిగా ఆటలను విడిచిపెట్టనూ లేదు. చదువు-క్రీడలు జోడు గుర్రాలుగానే నా విద్యాభ్యాసం సాగింది.



బోటింగ్‌లో అశోక్



ప్రతిభకు పురస్కారం అందుకుంటూ...



క్రికెట్ ఆడుతూ..



ట్రెక్కింగ్‌లో...

**ట్రెక్కింగ్... అదో గొప్ప థ్రిల్**

సాహసాలతో కూడిన ఆటలంటే కూడా నాకు చాలా ఇష్టం. ట్రెక్కింగ్ అందులో ముఖ్యమైంది. దీనికి సంబంధించి ప్రత్యేక శిక్షణ తీసుకోవడంతో పాటు ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన శిబిరాల్లో పాల్గొన్నాను. పర్వతారోహణ చేస్తున్న క్రమంలో దారి తప్పి పరిస్థితి ప్రాణాల మీదకు వచ్చింది. అయితే... మాతో పాటు వచ్చిన ఓ కుక్క వెళుతున్న మార్గాన్నే అనుసరించడం ద్వారా 21 వేల అడుగుల ఎత్తులో ఉన్న గమ్యాన్ని చేరుకోగలిగాం. ఆటలెన్ని ఉన్నా.... ఫుట్‌బాల్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ ఆట స్వల్ప వ్యవధిలో... 90 నిముషాల్లోనే ముగిసిపోతుంది. దీనికి తోడు ఆటలో ప్రతి క్షణం ఉత్కంఠ ఉంటుంది. ఇందులో ఫిజికల్‌గా యాక్టివిటీ, టీమ్ స్పిరిట్ పతాక స్థాయిలో కన్పిస్తాయి. టేబుల్ టెన్నిస్‌లో నాకు ఎన్నో పతకాలు వచ్చినా.... ఫుట్‌బాల్ ఆటలో వచ్చే మజానే వేరు. కళాశాల విద్య రోజుల్లో హార్స్ రైడింగ్ కూడా హాబీనే. అప్పుడప్పుడు బోటింగ్, క్రికెట్ క్రీడల్లో పాల్గొనేవాడిని. కళాశాల స్థాయికి వచ్చిన తర్వాత స్టూడెంట్ అసోసియేషన్ తరపున పోటీలను నిర్వహించాం. వివిధ కార్యక్రమాలకు సారథ్యం వహించాను. వక్తృత్వ పోటీలు, మాక్ పార్లమెంట్ నిర్వహణ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందింపజేయడం వంటివి లక్ష్యంగా మా యాక్టివిటీ ఉండేది.

**శాప్ సారథిగా...**

ఐఏఎస్ సర్వీసులో చేరిన తర్వాత శాప్ ఎండీగా మన రాష్ట్రంలో నిర్వహించిన టోర్నమెంట్లు ఎంతో సంతృప్తి నిచ్చాయి. ఆఫ్రో ఆసియా గేమ్స్ సందర్భంగా రెండు హాకీ స్టేడియాల నిర్మాణం, షూటింగ్ ఛాంపియన్‌షిప్, వాటర్ స్పోర్ట్స్, డబ్ల్యూటీఏ హైదరాబాద్ ఓపెన్, వరల్డ్ బిలియర్డ్స్ తదితర అంతర్జాతీయ టోర్నమెంట్ల నిర్వహణ ద్వారా నాకు మంచి పేరు వచ్చింది. 2003లో రూరల్ ఒలింపిక్స్‌కి రూపకల్పన చేశాను.

సానియా మీర్జా టెన్నిస్ శిక్షణకు అప్పట్లో ప్రభుత్వ ఆదేశం మేరకు రూ.60 లక్షలు మంజూరు చేశాను. అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు వైఎంసీఏ యూత్ వింగ్‌కు నేషనల్ ఛైర్మన్‌గా వ్యవహరించడం మరచిపోలేని అనుభూతి. ఇటువంటివన్నీ వృత్తిపరంగా ఉన్నతాధికారిగా ఆత్మ సంతృప్తిని మిగిల్చిన క్షణాలు.

**క్రీడలను వృత్తిగా స్వీకరించాలి...**

భారతదేశంలో వందకోట్ల జనాభా ఉంది. అందులో 50 శాతం యువత ఉన్నప్పటికీ క్రీడాభినివేశం తక్కువనే చెప్పాలి. క్రీడలను వృత్తిగా స్వీకరించే అలవాటు పశ్చిమ దేశాల్లో ఉంది. మనకు ఈ అలవాటు లేదు. పరికరాలు, మౌలిక వసతులు, శిక్షణలో నాణ్యత లేదు. దాంతో అంతర్జాతీయ ప్రమాణాలు అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వం, అసోసియేషన్లు, క్రీడాకారులు అంతా కలిసి సమష్టిగా ఈ సమస్యపై దృష్టి సారిస్తేనే మనకు అంతర్జాతీయ క్రీడాకారులు తయారవుతారు.

**బయోడేటా**

జి.అశోక్‌కుమార్, ఐఏఎస్.,

| | |
|---|---|
| ప్రస్తుత హోదా: | మెట్రో వాటర్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ |
| తల్లి, తండ్రి: | రాజమ్మ, గోపాల పిల్లై |
| పుట్టిన తేదీ: | 7-2-1964 |
| స్వస్థలం: | చెంగనూరు (కేరళ) |
| విద్యాభ్యాసం: | త్రివేండ్రం (బి.టెక్-87) |
| ఐఏఎస్‌గా ఎంపిక: | 1991 (ఫస్ట్ ఛాన్స్‌లో) |